క్లుప్తంగా

మరిడిమాంబ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్య వలస గ్రామ ఇలవేల్పు మరిడిమాంబ అమ్మవారి జాతరను ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఉత్సవాల పోస్టర్‌ను ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ బలిరెడ్డి శ్రీను మాట్లాడుతూ 8వ తేదీన కోటి దీపారాధనతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 9వ తేదీన అనుపు మహోత్సవం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ నాయకులు బి.సత్యనారాయణ, బి.అప్పారావు, పి.రవి, పి.కొండలరావు, వి.వరహాలు, పాపారావు, వి.శ్రీను, పి.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ నూకాంబికకు సారె సమర్పణ



సారెను ఊరేగిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధి దయాల్‌నగర్ క్వారీ రోడ్డులో కొలువుదీరిన స్వర్ణ నూకాంబిక అమ్మవారి ఆలయ 12వ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అమ్మవారికి మంగళవారం సారె సమర్పించారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి సారె ఊరేగింపును ప్రారంభించారు. అధిక సంఖ్యలో మహిళలు పిండివంటలు తయారు చేసి తీసుకువచ్చారు. వాటిని ఊరేగింపుగా తీసుకువెళ్లి, అమ్మవారికి నివేదించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించనున్నామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకుడు శివరామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్య శిక్షణ

విశాఖ విద్య: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న సబ్జెక్టు టీచర్లకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్)లో భాగంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో శిక్షణ నిర్వహించారు. మంగళవారం సైన్స్, హిందీ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. వృత్తి నైపుణ్య శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సమగ్ర శిక్ష అభియాన్ ఏఎంవో ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మూడు రోజులు పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు విజయవంతమయ్యాయన్నారు.

కిరండూల్ లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం : భద్రతా కారణాల వలన కిరండూల్‌లో లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీలలో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. కిరండూల్‌లో బుధవారం బయల్దేరవలసిన కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుండి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. విశాఖ బుధవారం బయల్దేరే విశాఖ- కిరండూల్ (08551) దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్‌లో బుధ,గురువారాల్లో బయల్దేరవలసిన కిరండూల్ – విశాఖ రైలు ఆయా తేదీలలో కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటాయి.

13 నుంచి పన్ను చెల్లించని వాహన తనిఖీలు

గోపాలపట్నం: జిల్లా వ్యాప్తంగా పన్నులు చెల్లించని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని డీటీసీ రాజారత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఫోన్ల ద్వారా వాహన యజమానులకు సమాచారమిచ్చామని, ఈ నెల 11లోగా పన్నులు చెల్లించాలన్నారు. ఈ నెల 13 నుంచి తనిఖీలు చేపడతామన్నారు.


విలీన గ్రామాల్లో జాతరల కోలాహలం



పైడిమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న దేవన్‌రెడ్డి



అలంకరణలో లేమర్తి ఫార్మాసిటీ కాలనీ గ్రామదేవత చింతాలమ్మ



పూజలందుకున్న దువ్వాడ గ్రామదేవత పరదేశిమాంబ



పూజలందుకుంటున్న పోలిపల్లి అమ్మవారు

- పెదమడక, పినమడక, లేమర్తి, దువ్వాడ, మంగళపాలెం గ్రామాల్లో పండగ సందడి
- ఘనంగా గ్రామదేవతల అనుపు మహోత్సవాలు

నిర్వాసిత కాలనీలు, విలీన గ్రామాల్లో మంగళవారం పండగ వాతావరణం నెలకొంది. అమ్మవార్ల జాతరల నేపథ్యంలో ఊళ్లన్నీ సందడిగా మారాయి. వేకువజాము నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గ్రామదేవతలకు పసుపు, కుంకుమ, చీర, సారెలతో మొక్కులు చెల్లించారు.

అగనంపూడి: జీవీఎంసీ 85, 88 వార్డుల్లోని పలు గ్రామాల్లో గ్రామదేవతల సంబరాలు అంబరాన్ని అంటాయి. 85వ వార్డు పెదమడక వాసుల ఇలవేల్పు పైడిమాంబ అమ్మవారి అనుపు ఉత్సవాల్లో భాగంగా మగళవారం ఉదయం నుంచి విశేష పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి చీర, సారెలు, గాజులు కానుకలుగా సమర్పించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా చింతాలమ్మ జాతర

ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీ లేమర్తి అగ్రహారం గ్రామదేవత చింతాలమ్మ వారి జాతర సందర్భంగా ఊరంతా విద్యుత్ వెలుగులతో నిండిపోయింది. ఆరు నిర్వాసిత కాలనీల నుంచి భక్తులు తెల్లవారుజామున ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అనుపు మహోత్సవం భారీ ఊరేగింపుతో ముగిసింది.

బోయమాంబకు ప్రత్యేక పూజలు

అగనంపూడి సెక్టార్–1 నిర్వాసిత కాలనీ పినమడక, పూడివానిపాలెం, కొత్తూరు గ్రామవాసుల ఇష్టదైవం బోయమాంబ అమ్మవారి అనుపు మహోత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. సెక్టార్–1లోని నిర్వాసితులు, పరిసర కాలనీల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దల సమక్షంలో పండగ ఘనంగా నిర్వహించారు.

పరదేశిమాంబ అనుపు ఉత్సవాలు

88వ వార్డు దువ్వాడ, మంగళపాలెం గ్రామస్తుల ఆరాధ్య దైవం పరదేశిమాంబ, పరదేశమ్మ అమ్మవార్ల ఉత్సవాలు మంగళవారం అనుపుతో ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయానికి చేరుకుని ఇష్టదైవానికి పూజలు చేశారు. సాయంత్రం భారీ సాంస్కృతిక ప్రదర్శనలు, మందుగుండు సామగ్రి నడుమ అమ్మవారి అనుపు ఉత్సవం నిర్వహించారు.



అమ్మవారి దర్శనానికి క్యూలో నిరీక్షిస్తున్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు చినఅక్కిరెడ్డిపాలెం గ్రామ దేవత పోలిపల్లి అమ్మవారి పండుగ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, నాయకులు సంద్రాన నూకరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం



దీక్షలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను అస్థిరపరిచేందుకు కేంద్రం ఒప్పటికే అనేక అవరోధాలు సృష్టించి నష్టాల వైపు నెట్టిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. అదీ చాలదన్నట్టు అరకొరగా జరుగుతున్న ఉత్పత్తిని కూడా నిలిపివేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 754వ రోజు మంగళవారం ప్లాంట్‌లోని సీవో మరియు సీసీపీ విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం యొక్క విధి ప్రైవేట్ వ్యక్తులతో కలిసి వ్యాపారం చేయడం కాదని, వాణిజ్యానికి ఊతమివ్వడమేనని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల మీద ఆధారపడి ఉన్న అనేక మంది కార్మికులు, శ్రామికులకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ ప్రతినిధులు మునగపాక అచ్చింనాయుడు, మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యంలో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. వేకువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. వారం రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగించారు. స్థానిక మహిళలు పూర్ణకుంభాలతో, పసుపు కుంకుమలతో స్వాగతం పలికారు. అమ్మవారి ఘటాలను ఎత్తుకున్న వారి పాదాలకు జలాభిషేకం చేశారు. చీరలు చూపించి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



కోకెన్ బెహరా మృతదేహం

పెదగంట్యాడ: మండలంలోని గొడ్డువానిపాలెంలో (ఫైర్ స్టేషన్ వెనుక) ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన శ్రీకాంత్ బెహరా ఆటోనగర్ ప్రాంతంలో ఓ షెడ్డులో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. శ్రీకాంత్ బెహరాతో పాటు అతని భార్య కోకెన్ బెహరా (21) ఏడాదిగా ఆటోనగర్‌లోని శ్రీవెంకట దుర్గా ఎంటర్‌ప్రైజెస్ అనే ప్లాస్టిక్ స్క్రాప్ దుకాణంలో పని చేస్తున్నారు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. ఈ నెల 6న మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో భోజనం అనంతరం బాత్‌రూమ్‌కు వెళ్లిన ఆమె ఎంతకీ తిరిగి రాలేదు. ఆమె కుమార్తె బాత్‌రూమ్ తలుపు వద్ద ఏడుస్తూ ఉండటం గమనించిన వారి కుటుంబసభ్యురాలు సునీత వెంటనే శ్రీకాంత్ బెహరాకు తెలిపింది. వారు బాత్‌రూమ్ తలుపు పగలగొట్టి చూడగా కోకెన్ బెహరా సీలింగ్ రాడ్‌కు చీరతో ఉరిపోసుకుని ఉంది. వెంటనే ఆమెను కిందకు దించి చూడగా, అప్పటికే ఆమె మృతి చెందింది. స్క్రాప్ దుకాణానికి చెందిన వాసా లోవగాంధీ ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు ఉచిత వైద్య శిబిరం నేడు

గాజువాక : మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు జీవీఎంసీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు యూసీడీ విభాగం సహాయ ప్రాజెక్టు అధికారి సంతోష్ కుమార్ తెలిపారు. జోనల్ కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానున్న శిబిరంలో మహిళలకు బీపీ, షుగర్ వైద్య పరీక్షలను నిర్వహిస్తామన్నారు. మహిళలతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆర్పీలు పాల్గొనాలని కోరారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



కోరాడలో ప్రచారం చేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



రమాప్రభకు సంఘీభావం తెలుపుతున్న ఉక్కు కార్మిక నాయకులు

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపించడంతో ప్రచారం ఊపందుకుంది. అభ్యర్థులతో పాటు వారికి మద్దతు ఇస్తున్న పార్టీల నాయకులు విస్తృతప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా గాజువాకలోని టీఎస్సార్, టీబీకే కళాశాలలో అధ్యాపకులను ఎమ్మెల్యే నాగిరెడ్డి కలిసి, ప్రచారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యావంతులూ ఆలోచించి ఓటు వేయండి

పెదగంట్యాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులైన పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో 67, 68, 69, 70వ వార్డు పరిధిలోని పట్టభద్రులతో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యావంతుడైన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, పల్లా చినతల్లి, ఎస్ఎండీ గౌస్, కార్పొరేటర్లు గుడివాడ అనూష, ఉరుకూటి చందు, నాయకు లు సన్యాసిరావు, పూర్ణానంద శర్మ, గుడివాడ లతీష్, కృష్ణ, పల్లా పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

75వ వార్డులో.. : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి కోరారు. పార్టీ 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కోరాడ, సీతానగరం తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు.

బర్మా కాలనీలో..

వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో బర్మా కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి ఎన్నికలలో తొలి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్ సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు వేయాలని అభ్యర్థించారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలపర్చిన అభ్యర్థి డాక్టర్ వేపాడ చిరంజీవిరావుకు పట్టం కట్టాలని ఆ పార్టీ నాయకుడు పులి వెంకటరమణారెడ్డి కోరారు. 75వ వార్డు పరిధిలోని కోరాడ, ఎస్సీ కాలనీల్లో మంగళవారం ప్రచారం చేశారు.

బీజేపీ విస్తృత ప్రచారం

గాజువాక : బీజేపీ మద్దతు అభ్యర్థి పీవీఎన్ మాధవ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు మంగళవారం గాజువాకలో ప్రచారం నిర్వహించారు. బీజేపీ పాండిచ్చేరి ఇన్‌చార్జి పురిగల్ల రఘురామ్ ఆధ్వర్యంలో గాజువాక హైస్కూల్, శ్రామికనగర్, చినగంట్యాడ, మింది, ఉక్కునగరం ప్రాంతాల్లో పర్యటించి మాధవ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. గాజువాక కో ఆర్డినేటర్ కరణం రెడ్డి నర్సింగరావు, నాయకులు పాల్గొన్నారు.

66వ వార్డులో..

సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు 66వ వార్డులో ప్రచారం చేశారు. సీనియర్ నాయకుడు పేరం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కైలాసనగర్‌లోని పట్టభద్రుల ఓటర్లను కలిసి, ఓటు అభ్యర్థించారు.

రమాప్రభకు కార్మిక సంఘాల సంఘీభావం

పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన పలు కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. గాజువాక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడారు. ప్రైవేటీకరణ నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రమాప్రభ పూర్తిస్థాయిలో అండగా ఉంటారనే విశ్వాసంతో తాము మద్దతు తెలుపుతున్నామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణ, సీహెచ్.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

'వేదిక'పై వేడుక

బీచ్‌రోడ్డు : నగరవాసుల్లో ఉన్న ప్రతిభను చాటుకునేందుకు జీవీఎంసీ ఆధ్వర్యంలో 'వేదిక' ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆర్కే బీచ్ వేదికగా తమ టాలెంట్‌ను ప్రదర్శించే అవకాశం కల్పించింది. జీ–20 సదస్సు నేపథ్యంలో వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ చేపట్టింది. మూడు రోజులుగా జరిగిన వైజాగ్ టాలెంట్ హంట్‌కు విశేష స్పందన లభించింది. 400 కుపైగా ప్రదర్శనలు జరిగాయి. ముగింపు రోజైన మంగళవారం దివ్యాంగులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఫ్లూట్, గిటార్ వంటి వాయిద్యాలు, పాటలు పాడుతూ ప్రతిభ చాటుకున్నారు.



పాట పాడుతున్న దివ్యాంగుడు





అలరించిన కళాకారుల నృత్య ప్రదర్శనలు

ఇకపై ప్రతీ శని,ఆదివారాల్లో వేదిక : జీ–20 సదస్సు జరిగే వరకు ప్రతీ శని, ఆదివారాల్లో ఈ కార్యక్రమం ఆర్కేబీచ్ వద్ద నిర్వహించనున్నట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసినాయుడు తెలిపారు.

పెట్టుబడుల సదస్సు విజయవంతం

- రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఎంవోయూలు
- సీఎం జగన్‌పై నమ్మకంతో ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలు
- ఎమ్మెల్యే నాగిరెడ్డి
- సమ్మిట్ సక్సెస్‌పై సంబరాలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: విశాఖ నగరంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్–2023 విజయవంతమైనందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. రూ.13లక్షల కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన వేడుకల్లో ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో 352 ఎంవోయూలు చేసుకున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ అంబానీ వంటి వారు ఆంధ్రప్రదేశ్ వైపు చూడలేదని, కానీ ఇప్పుడు ఆయన కూడా ఇక్కడకు రావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించడంతో పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తున్నారని వివరించారు. వచ్చే నెల నుంచే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ నుంచి పాలన సాగించనున్నారన్నారు. ఇక్కడ పరిశ్రమలు స్థాపిస్తే అందుకు అవసరమైన వనరులను సమకూర్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో బూటకపు ఒప్పందాలు చేసుకున్నారన్నారు. మూడు సార్లు ఇక్కడ పారిశ్రామివేత్తలతో సదస్సులు నిర్వహించారని, అయితే ఒక్కరు కూడా పెట్టుబడులు పెట్టలేదని ఎద్దేవా చేశారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కల్యాణ్ రాష్ట్రం పాలిట రాక్షసుల్లా తయారయ్యారని ధ్వజమెత్తారు. గతంలో ఇక్కడ బూటకపు సదస్సులు నిర్వహించారన్నారు. కానీ ఇప్పుడు 25వేల రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, 352 ఎంవోయూలు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, నాయకులు మార్టుపూడి పరదేశి, వెంపాడ అప్పారావు, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, బొడ్డ గోవింద్, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, ఎన్నేటి రమణ, రోజారాణి, అండిబోయిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

10 రోజుల్లో సుందరీకరణ పూర్తి కావాలి

- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశం
- షీలానగర్ నుంచి ఎయిర్‌పోర్టు సిగ్నల్ వరకు పనుల పరిశీలన



అధికారులకు ఆదేశాలు ఇస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

అక్కిరెడ్డిపాలెం: జీ–20 సదస్సు నేపథ్యంలో నగర సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన షీలానగర్ సిగ్నల్ పాయింట్ నుంచి ఎయిర్‌పోర్ట్ సిగ్నల్ పాయింట్ వరకు సుందరీకరణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నుంచి నగరంతో పాటు వివిధ ప్రాంతాలకు విచ్చేసే అతిథులకు ప్రధాన మార్గం ఇదే కనుక అధికారులు సుందరీకరణ, పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. పనులు సరిగ్గా నిర్వహించకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 రోజుల్లో పనులు పూర్తి చేయాల్సిందేనని ఆదేశించారు. సదస్సుకు దేశ, విదేశాల నుంచి వచ్చే అతిథులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించే బాధ్యత మనదే అన్నారు. అందుకు తగినట్లుగా సుందరీకరణ, పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలంకరణ, పెయింటింగ్, ఇతర ఇంజినీరింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు, డీడీ (హార్టికల్చర్) ఎం.దామోదరరావు, గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఎస్ఈ రామ్మోహనరావు, ఈఈలు ప్రసాద్ బాబు, సంతోష్, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్, ఏఈ (ఎలక్ట్రికల్) నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువులకు కామెర్ల నుంచి రక్షణ



తెలంగాణ మంత్రి కేటీఆర్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న ప్రసాద్ తండ్రి చిననాగయ్య



పరికరం గురించి వివరిస్తున్న ముద్దం ప్రసాద్ (ఫైల్)

- కొత్త పరికరాన్ని ఆవిష్కరించిన అక్కిరెడ్డిపాలెం వాసి
- అవార్డు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం

అక్కిరెడ్డిపాలెం: నవజాత శిశువుల్లో కామెర్ల నివారణకు ఓ కొత్త పరికరాన్ని రూపొందించి ప్రశంసలందుకున్నారు జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలేనికి చెందిన ముద్దం ప్రసాద్. హైదరాబాద్‌లో ఐఐటీ పూర్తి చేసిన ప్రసాద్ చేసిన కృషిని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవార్డును ప్రకటించింది. హైదరాబాద్ బేగంపేటలోని ఐటీసీ కాకతీయలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రసాద్ తండ్రి ముద్దం చిన నాగయ్య ఈ అవార్డును అందుకున్నారు. వివరాలివి.. నవజాత శిశువుల్లో ఎక్కువ మంది కామెర్ల బారిన పడుతుంటారు. వారికి ఫొటో థెరపీ అందించాల్సి ఉండడంతో తల్లి నుంచి శిశువులను వేరుగా ఉంచాల్సి వస్తోంది. ఆ సమయంలో శిశువు తల్లిపాలకు దూరమవుతారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రసాద్ ఎస్‌లైట్ 360 పరికరాన్ని రూపొందించారు. ఈ పరికరంలోని బ్లూ రేస్ శిశువు శరీరంపై పడి, యూరిన్ ద్వారా ఇన్ఫెక్షన్ తొలగిపోతుంది. ఈ పరికరం తయారీకి కావలసిన అనుమతుల కోసం ప్రసాద్ యూరప్‌లో ఉండడంతో, ఆయన తండ్రి నాగయ్య ఈ అవార్డును అందుకున్నారు.

మహిళల పాత్ర కీలకం



కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పోటీల్లో పాల్గొన్న స్థానిక మహిళలు



మాట్లాడుతున్న విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి

అగనంపూడి: మహిళలు అన్ని రంగాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారని ఉక్కు ఉన్నతాధికారి ఎస్.భానుపారి, న్యాయవాది కె.ఎస్.కళావతి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో సమానావకాశాలు పొందుతున్నారని, పోటీ పడి వాటిని దక్కించుకుంటున్నారని అన్నారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, డబ్ల్యూఈపీ సెల్ డీన్ మృదులా దేవి, వివిధ విభాగాల డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కణితి పాఠశాలలో ఆటల పోటీలు

కూర్మన్నపాలెం: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మహిళలకు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆటల పోటీలను నిర్వహించారు. మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ మ్యాజిక్ బస్ సిబ్బంది బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ మన్నాజీ, మ్యాజిక్ బస్ సంస్థ శిక్షణ మరియు పర్యవేక్షణ అధికారి సురేంద్ర, శంకర్, యూత్ మెంటార్స్ రేవతి, గౌతమి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.